

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 85 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 24, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# ప్రజల ఓట్లు పనికిరావా..?






ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తున్నది దేనికోసం

ప్రజలు ఎన్నుకుంటున్న నాయకులు దిగజారుతున్నారు

ఎన్నికల విధానంలో సంభవిస్తున్న మార్పులు ఎవరికోసం

ఎన్నికల కమిషన్లు బాధ్యత రాహిత్యంగా మారుతున్నాయి

ప్రజల ఓట్లకు విలువలు తగ్గుతున్నాయి

ప్రజలు ఎంచుకునే నాయకులే

ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారు

సిగ్గుమాలిన రాజకీయాలను ప్రేరేపిస్తున్నోళ్ళంతా

పెద్ద నాయకులే

రాజకీయ ఎన్నికల సరళి ఎందుకు

ఇంతలా దిగజారిపోతుంది

వ్యవస్థలన్నీ వక్రమార్గాలను ఎంచుకుంటున్నాయి

ప్రజల ఓట్లను పక్కదారి పట్టిస్తున్న సాంకేతిక పరికరాలు

డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రాజకీయాలను దిగజార్చడంలో నాయకులు తీరికపాటు లేని సమయాన్ని గడుపుతున్నారని డాక్టర్ బరిగెల శివ ఎద్దేవ చేశారు.ఎన్నికలు నిర్వహించబడుతున్నంతసేపు రాజకీయ పార్టీలు ప్రజల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తిరుగుతుండడం ఆనవాయితిగా మారిపోతున్నప్పటికిని ప్రజలు వేస్తున్న ఓట్లు నాయకుల గెలుపులో కీలక పాత్రలు పోషిస్తుండగా గెలిచిన నాయకులు పూటగడవకముందే పార్టీలు మారుతూ రాజకీయ పార్టీలకు వెన్నుపోటు పొడుస్తూ గెలిపించిన ప్రజలను నట్టేట ముంచుతూ డబ్బులు సంపాదన కోసం అధికారంలో ఉన్న పార్టీలకు మారిపోతు న్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రత్యక్షపు రాజకీయ ఎన్నికలలో ప్రజలు ఆశించిన ఫలితాలు రాకపోవడానికి ప్రధాన కారణం సాంకే తిక ఎన్నికల విధానమేనని గుర్తు చేశారు. ఎన్నికలలో నిలబడుతున్న రాజకీయ నాయకుల భవిష్యత్తును నిర్ధారించాల్సింది ప్రజల ఓట్లు కానీ దానికి భిన్నంగా సాంకేతిక పరికరాలు రాజకీయ నాయకుల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయని నిజమైన నాయకుని ఓటమి పాలుచేస్తూ పనికిమాలిన నాయకుల గెలుపులను

- మిగతా 2లో..

## ఎమ్మెల్యే మాధవరం ఆరోపణలను ఖండించిన హైడ్రా

సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు మారబోవని చెప్పిన హైడ్రా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణల్లో నిజం లేదని స్పష్టీకరణ

2014లో నిర్ధారించిన హద్దుల ప్రకారమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి

ఆక్రమణలకు గురైన చెరువును 31 ఎకరాలకు విస్తరించామని వెల్లడి

పేదలకు అన్యాయం, పెద్దలకు రక్షణ కల్పించే ఉద్దేశం లేదని స్పష్టత




6

## హైదరాబాద్ మెట్రో రైలుపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం

ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం

రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం



5

## గచ్చిబౌలిలో రూ.1.76 లక్షలు పలికిన చదరపు గజం భూమి

3

నగరంలోని పలు ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు భూముల వేలం


కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాలులో 14 స్థలాల వేలం


బాలాజీనగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలు

## నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో చిన్నారి మృతి

కుల అహంకార దాడిగా ఆరోపణలు

2





## సంఘం "కూల్చివేతకు" రంగం సిద్ధం

క్రైస్తవ సంఘాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

తప్పుడు మార్గంలో సొసైటీలో చొరబడ్డారు

అక్రమ పత్రాలను సృష్టించింది ఎవరు

క్రైస్తవ సంఘాన్ని కూల్చివేసి ప్లాట్లు చేయాలనే ఆలోచన ఎవరిది

సంఘస్తులను బెదిరిస్తున్న ఉద్యోగులు

తప్పు చేశామంటూనే శాసిస్తున్నారు

అబద్దాలతో రెచ్చిపోతున్న ఉద్యోగులు

అక్రమ ఆధారాలతో కోట్ల తేల్చుకుంటామంటూ బెదిరింపులు

కాజీపేట సంఘానికి వడ్డపల్లి సంఘానికి పొంతనే లేదు

బ్రతికున్న దైవజనున్ని చనిపోయినట్లు చిత్రీకరించారు

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ప్రజల ఓట్లు పనికిరావా ?

మొదటి పేజీ తరువాయి

ఈవీఎం శాసిస్తున్నాయన్నారు.ఓట్ల శాతాలను పోల్చి చూస్తూ విడుదల చేయబడుతున్న ఫలితాలలో ఎన్నికల నియమావళి విలువలను దేశ ప్రజలు గమనిస్తూ రాజకీయాలను ప్రజలను వ్యవస్థలను నాశనం చేస్తున్న పార్టీలు వాటి బల బలాలను పెంచుకునే ప్రయత్నంలో బాగంగా అక్రమార్కులైన నాయకులనే ప్రజలు విశ్వసించే స్థాయికి రాజకీయాల విలువలు దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలను మోసగించడానికో ప్రజాస్వామ్యాన్ని మోసగించడానికో తెలియదు గాని ఎన్నికలు జరుగుతున్న విధానం పట్ల దేశవ్యాప్తంగా ప్రజలు మౌనాన్ని ప్రదర్శిస్తున్నారన్నది వచ్చి వాస్తవమన్నారు.ఒకవైపు ప్రభుత్వాలు ఆడుతున్న అబద్దాలతో ప్రజలు విసిగి వేజారిపోతుండగా నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాలు అక్రమ పరిపాలనలు నిజాయితీతో కూడిన రాజకీయాలను ప్రజలకు దూరం చేస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న రాజకీయాలను చూస్తుంటే ఎన్నికలకు జరుగుతున్న విధానం పట్ల ప్రజల విశ్వాసం పూర్తిగా సన్నగిల్లిందని తెలుపుతూ ప్రజల వేస్తున్న ఓట్లతో పని లేకుండా సాంకేతిక పరికరాల సహాయంతో ఎన్నికల్లో గెలుపొందే అక్రమ మార్గాలను సిద్ధపాటుగా చూపిస్తూ ఎంచబడే రాజకీయాలకు చెందిన ఎన్నికల నియమావళి కొనసాగిస్తున్నట్లుగా లెక్కలేని సందర్భాల్లో కళ్లకు అద్దినట్లు కనిపిస్తుందన్నారు.అధికారంలో ఉన్న పార్టీలు రాజకీయాలను శాసించడం కోసం ప్రభుత్వ యంత్రాంగాలను పావులుగా వాడుకుంటుండడం ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు.ప్రగతిని సాధిస్తామని ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వాలు ఎన్నికలు అనేసరికి ప్రజా సొమ్మును తిరిగి ప్రజలకు పంచుతూ రాజకీయాల్లో గెలుపొందడం చలాకితనంల భావిస్తూ ప్రజలను బోల్తా కొట్టిస్తూనే ప్రజలకు సేవ చేస్తున్నామని అన్ని సందర్భాలలో ప్రచారాలు చేసుకుంటున్నారని అన్నారు.ఒకవైపు కరుకునోట్లతో కూడిన రాజకీయాలను చూసి తట్టుకోలేకపోతున్నా సాధారణ రాజకీయ నాయకులు ప్రజల ఓట్లతో బలపడుతూ గెలుపొందుతూ మెజారిటీని పొందుకుంటున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగాలు ఒక్కసారిగా వాటిని బోల్తా కొట్టించడం హీనాతి హీనమైన చర్యలుగా భావించాల్సి ఉందన్నారు.ఒకవైపు రాజకీయ నాయకుల దిగజారుడుతనం మరోవైపు అధికార యంత్రాంగకు బరితెగింపు తనం ప్రజలను తీవ్రమైన ఇబ్బందుల పాలు చేస్తుందని విమర్శించారు.ప్రజలు ప్రభుత్వాలను విమర్శిస్తూ చీదరించుకుంటుంటే ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోవడం పూర్తిగా మానేస్తున్నారని అన్నారు.రాజకీయాలలో ఎప్పుడూ లేని కులాధిపత్యం ఎన్నడూ లేని మతాధిపత్యం ఎలాంటి సందర్భంలో నైనా కనీ విని ఎరుగని పైసాధిపత్యం రాజకీయాలను శాసిస్తున్నట్లుగా స్పష్టంగా కనిపిస్తుందన్నారు.కులం కార్డులతో కలం రాతలను శాసించే స్థాయికి కుల పిచ్చి పెరిగిపోయిందని తీవ్రంగా విమర్శించారు.రాజకీయ నాయకులు పాటిస్తున్న విధానాల పట్ల ప్రజలకు వివరించరాని అన్యాయం జరుగుతుందని కాలం గడుస్తున్న రాజకీయ నాయకులలో మార్పులు రాకపోవడం చూడడానికే వికారంగా ఉందన్నారు.ఒకవైపు రాజకీయ విలువలు దిగజారిపోతుంటే మరోవైపు రాజకీయ నాయకులు సంపన్నుల సంఖ్యలో చేరిపోతూ బలపడుతున్నారని ప్రజాసేవతో సంబంధం లేకుండా పలుకుబడితో రాజకీయాలు ఆగించబడుతున్నంతకాలం ప్రజలకు కష్టాలు పెరిగిపోతూనే ఉంటాయని ప్రత్యక్షంగా గుర్తుకు చేశారు.పేద ప్రజలనుకోవాలనేసోయి ఒక్కనికే లేదన్నారు.ప్రజా వేదికలపై నీతులు వల్లించే మొనగాళ్లు అంతా ప్రజాసేవకు ఏమాత్రం పనికిరాని నాయకులేనని గుర్తుకు చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రత్యక్ష ఎన్నికలు ప్రజల ఓట్లతో ముడిపడే రోజులు ఎప్పుడో చెల్లుబాటు అయినట్లుగా ఉందన్నారు.ప్రజలేమో డబ్బులు తీసుకుని ఓట్లు వేస్తున్నారు నాయకులేమో డబ్బులు ఇచ్చి ఎన్నికల్లో నిలబడుతున్నారు గెలుపొందిన నాయకులు పార్టీలు మారుతుండగా ఓటమి పాలైన నాయకులు పోరాటాలు చేస్తున్నారని అన్నారు.అన్ని సందర్భాల్లో రాజకీయాలను శాసిస్తున్నది మాత్రం పైసలేనని పైసా సంపాదన కలిగినోడు ప్రత్యక్ష రాజకీయాల్లో గట్టెక్కడం పెద్ద కష్టమైన పని ఏమీ కాదన్నారు.రాజకీయాలను రాజకీయాలుగా చూసే రోజులు వస్తాయో రావో తెలియదు గాని రాజకీయాలను శాసిస్తున్న నాయకులు మాత్రం రాజకీయ విలువలను దిగజార్చుకుంటూ పోతూనే ఉన్నారన్నారు.ఓట్లకు పైసలకు ముడిబడి జరిగే రాజకీయాలకు విముక్తి కలిగినప్పుడే ప్రజాస్వామ్య రక్షణ వెలుగులోనికి వస్తుందని అలా జరగనంత కాలం రాజకీయ నాయకులు దిగజారుడు రాజకీయాలను బలపరుస్తూ ఆదిపత్యపుపోరు కోసం ఆరాటపడుతూనే ఉంటారని విమర్శించారు.ప్రభుత్వ అధికారులు ప్రజాస్వామ్య విలువలను కాపాడనంత కాలం రాజకీయ నాయకులు ప్రజల జీవితాలను శాసిస్తూనే ఉంటారని అన్నారు.విలువలు లేని రాజకీయాలు సమాజాన్ని వికారంగా తయారుచేస్తున్నయని బాధ వ్యక్తం చేశారు.ప్రజల ఓట్లు పనికి వచ్చే రాజకీయాలకు తిరిగి పునాదులు వేయాలని గుర్తు చేశారు.

## నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో చిన్నారి మృతి

### కుల అహంకార దాడిగా ఆరోపణలు

**నాగర్ కర్నూల్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న ఘోర ఘటనలో ఒక చిన్నారి మృతి చెందిన సంఘటన తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఈ ఘటన కుల అహంకార దాడి కారణంగా జరిగినదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పసిపాప ప్రాణాలు కోల్పోవడం పట్ల స్థానిక ప్రజలు, సామాజిక సంఘాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. ఈ ఘటనపై స్పందించిన డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో కుల విద్వేషాలకు స్థానం లేదని, బ్రతుకు ఇచ్చే సమానత్వ భావన అవసరమని పేర్కొన్నారు. మతం, కులం పేరుతో మానవత్వాన్ని హరించడం అమానుషమని ఆయన అన్నారు. శతాబ్దాలుగా అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను గుర్తు చేస్తూ, మూలవాసుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారి మరణానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవగా, కుల వివక్ష నిర్మూలనపై మరింత చర్చ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## హనుమకొండలో కెవిపిఎస్ ధర్నా

### నాగర్‌కర్నూల్ కుమ్మెర ఘటనపై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్



**హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అమానవీయంగా హత్య చేసిన ఘటనపై నిందితులను వెంటనే అరెస్టు చేసి హత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుమ్మెర గ్రామంలో దేవాలయంలోకి వెళ్లేందుకు రజక కులస్తులను అగ్రకుల పెత్తందారులు అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. దేవుడి దగ్గరికి వెళ్లడానికి రూ.100 ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించగా గణేష్ అనే యువకుడిని సుమారు మూడున్నర గంటల పాటు చితకబాదారని తెలిపారు. తన భర్తను కొట్టవద్దని వేడుకున్న గణేష్ అక్క కీర్తి భార్య మౌనికపై కూడా దాడి చేసి, చివరకు రెండు నెలల పసిబిడ్డను కాలితో తన్ని హత్య చేశారని ఆరోపించారు. ఈ ఘటన మానవత్వాన్ని మంటగలిపే విధంగా ఉందని, సమాజం సిగ్గుతో తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఘటన ఈ నెల 18న జరిగినప్పటికీ పోలీసులు బాధితులపైనే కేసులు నమోదు చేసి, నిందితులను కాపాడే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎనిమిది మందిపై ఫిర్యాదు చేసినప్పటికీ నలుగురిని మాత్రమే అరెస్టు చేశారని, మిగతా వారిని కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. హత్య జరిగి స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ 'అటెంప్ట్ టు మర్డర్' కింద కేసు నమోదు చేయడం విడ్డూరమని అన్నారు. తక్షణమే హత్యా నేరం కింద కేసు నమోదు చేసి నిందితులను 24 గంటల్లో రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కెవిపిఎస్ ఆధ్వర్యంలో అన్ని ప్రజాసంఘాలను ఐక్యం చేసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీసుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ, అగ్రకుల దురహంకార హత్యలను అరికట్టాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు దూడపాక రాజేందర్, కుల మతాంతర వివాహితుల వేదిక జిల్లా నాయకుడు ఇస్లావత్ రవీందర్, కెవిపిఎస్ వ్యవస్థాపక సభ్యుడు కారు ఉపేందర్, డివైఎఫ్ఐ నాయకుడు జంపాల రమేష్, నార్లగిరి కొమురయ్య, రేణికుంట్ల చందర్, సిరిమిళ్ళ సుభద్ర, నేతగాని భారతి, అయిత మారుతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## అశోక టాకీస్ జంక్షన్‌లో ఆటోమేటిక్ కెమెరాలు ఏర్పాటు

### సిగ్నల్ జంప్ చేస్తే రూ.1050 జరిమానా

**హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ నగరంలోని అశోక టాకీస్ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టం చేయడానికి అధికారులు కీలక చర్యలు చేపట్టారు. ఆర్ఎం సూచనల మేరకు సోమవారం (ఫిబ్రవరి 23, 2026) నుంచి జంక్షన్‌లో ఆటోమేటిక్ ట్రాఫిక్ కెమెరాలు అమల్లోకి తీసుకువచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సిగ్నల్ ఉల్లంఘనలను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన ఈ ఆధునిక కెమెరాలు నియమాలను అతిక్రమించిన వాహనాలను స్వయంచాలకంగా నమోదు చేసి, వెంటనే జరిమానా విధించే విధంగా పనిచేస్తాయి. సిగ్నల్ జంప్ చేసినట్లయితే రూ.1050 జరిమానా విధించబడుతుందని, సంబంధిత వాహన యజమానికి నోటీసు జారీ అవుతుందని స్పష్టం చేశారు. ఎడిసి ఎస్/డబ్ల్యూ డబ్ల్యూఎల్2 డిపో ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఈ విషయమై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆటో, బస్సు, ఇతర వాణిజ్య వాహన డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ క్రమశిక్షణను పెంపొందించడం, ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నగర వాహనదారులు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు.

## సంఘం "కూల్చివేతకు" రంగం సిద్ధం

### క్రైస్తవ సంఘాన్ని విచ్చిన్నం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు
### తప్పుడు మార్గంలో సొసైటీలో చొరబడ్డారు
### అక్రమ పత్రాలను సృష్టించింది ఎవరు
### క్రైస్తవ సంఘాన్ని కూల్చివేసి ప్లాట్లు చేయాలనే ఆలోచన ఎవరిది
### సంఘస్తులను బెదిరిస్తున్న ఉద్యోగులు
### తప్పు చేశామంటూనే శాసిస్తున్నారు
### అబద్దాలతో రెచ్చిపోతున్న ఉద్యోగులు
### అక్రమ ఆధారాలతో కోట్ల తేల్చుకుంటామంటూ బెదిరింపులు
### కాజీపేట సంఘానికి వడ్డపల్లి సంఘానికి పొంతనే లేదు
### బ్రతికున్న దైవజనున్ని చనిపోయినట్లు చిత్రీకరించారు

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

క్రైస్తవ సంఘాలను విచ్ఛిన్నం చేయాలనే కుట్రలు దినదినం పెరిగిపోతున్నాయి అందులో భాగంగానే వడ్డేపల్లి ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఫెయిత్ హోమ్ చర్చ్ మినిస్ట్రీస్ సంఘాన్ని కూలదోయాలని కుట్రలు పన్నుతున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు సంఘానికి సంఘ సభ్యులకు తెలియకుండా 20 సంవత్సరాల తర్వాత సంఘం సొసైటీని వాళ్ల పేరు మీదికి మార్చుకొని సంఘ సభ్యులను వేదనలకు గురి చేయడమే కాకుండా సంఘాన్ని విచ్చిన్నం చేసి చర్చిని కూల్చివేసి భూమిని లాక్కోవాలని తీవ్రమైన కుయుక్తులు పన్నినట్లుగా సంఘ సభ్యులు సంఘస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉద్యోగస్తులలో ఒకతను వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్(పాస్టర్ అబ్రహం) గా పనిచేస్తూ ఉండగా అతని సోదరుడు ప్రభుత్వ జూనియర్ కళాశాల హన్మకొండలో జూనియర్ లెక్చరర్ గా ప్రసాదం పేరుతో పనిచేస్తున్నాడని సంఘస్తులు తెలుపుతున్నారు.తప్పుడు మార్గంలో సొసైటీని లాక్కునే ప్రయత్నాలు చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగులుగా చలామణి అవుతూ పాస్టర్ల అవతారం ఎత్తి వివాహాలు చేస్తున్నారని ఇదంతా సంఘాలకు తెలియకుండానే జరిగిపోతుండగా సంఘ సభ్యులను తీవ్రమైన మనోవేదనకు గురి చేస్తూ సదరు ఇద్దరు ఉద్యోగులు సంఘంపై సంఘస్తులపై (కీర్తిశేషులు )దైవజనులు మట్టెపల్లి రాజమౌళి కుటుంబంపై విషంగక్కే ప్రయత్నం చేస్తూ ఎలాగైనా సంఘాన్ని, సొసైటీని లాక్కోవాలని తీవ్రమైన ఒత్తిళ్లతోపాటు రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారని సంఘస్తులు వాపోతున్నారు.ప్రభుత్వ ఉద్యోగులు అయ్యుండి సొసైటీలో అడ్డదారిలో పేర్లు పెట్టుకోవడమే కాకుండా ఆర్థిక లావాదేవీలలో వాళ్ళ వాటా ఉందంటూ బలవంతంగా సంఘంపై ఒత్తిడి తేవడం కోసం అక్రమమైన మార్గంలో సొసైటీ పత్రాలను వాళ్ల పేర్ల మీద రాసుకొని సొసైటీ తో పాటు సంఘాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి తమ వైపు లాక్కోవాలని చూస్తున్నట్లుగా ప్రస్తుత సంఘస్తులు తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నారని సంఘస్తులు పదేపదే గుర్తు చేస్తున్నారు. 2016లో బయటకు వెళ్లి కాజీపేటలో సంఘం నడుపుకుంటున్న బి. రాజకుమార్ దీనికంతటికి ప్రధాన కారణమని సంఘస్తులు తెలుపుతున్నారు.సదరు ప్రభుత్వ ఉద్యోగులు వాళ్లతో పాటు బి. రాజకుమార్ పూట పూటకు అబద్ధాలు ఆడుతూ పలుపుబడి కలిగిన వ్యక్తులతో బెదిరింపులకు పాల్పడుతుండడం సంఘస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రస్తుతం సంఘాన్ని విచ్ఛిన్నం చేయాలని కుట్రలు పన్నుతున్న సదరు ఉద్యోగులు సంఘస్తుల జీవితాలను సొసైటీని ఏమి చేయదలచారో తెలియదు గాని ఉన్నపాటుగా క్రైస్తవ సంఘాన్ని పరిచర్యను సొసైటీని పూర్తిగా నిర్వీర్యం చేసి చర్చి స్థలాన్ని లాక్కోవాలని చూస్తున్నారని సంఘస్తులు తీవ్ర భయాందోళనలో బ్రతుకుతున్నారు.సదరు ఇద్దరు ఉద్యోగులను రాజకీయంగా ఎదుర్కోలేక అధికారికంగా ఎదుర్కోలేక భయభ్రాంతులకు గురవుతున్న పాత సంఘస్తులకు ప్రజా సంఘాలు పోలీస్ అధికారులు సహాయపడాలని కోరుతున్నారు.

**ఆ సొసైటీలో ఏం జరుగుతుంది త్వరలో..**

## హసన్‌పర్తి పీహెచ్‌సీ, ప్రైవేట్ ఆస్పత్రులపై డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు



**హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఏ. అప్పయ్య సోమవారం సాయంత్రం హసన్ పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, రోగులకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రిజిస్ట్రర్లు మరియు ఇతర అధికారిక రికార్డులను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించి, అవసరమైన వైద్య సేవలను సమయానికి అందించాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ కార్యకలాపాలపై డాక్టర్ కృతిక రెడ్డి వివరణాత్మక నివేదికను డీఎంహెచ్ఓ అప్పయ్యకు సమర్పించారు. అనంతరం నక్కలగుట్టలోని వీఆర్ఎస్ హెయిర్ క్రియేషన్స్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ నిర్వహించారు. చికిత్సకు ముందు అవసరమైన పరీక్షలు చేయించుకుని రావాలని సూచించగా, సంబంధిత వ్యక్తి దురుసుగా ప్రవర్తించడంతో చికిత్స నిరాకరించామని డాక్టర్ నవ్య తెలిపారు. సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో పాటు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ గడువు ముగిసినట్లు గుర్తించి షోకాజ్ నోటీసు జారీ చేశారు. తదుపరి నక్కలగుట్టలోని కిడ్స్ కేర్ హాస్పిటల్‌ను సందర్శించి అనుమతి పత్రాలు, నివేదికలను పరిశీలించారు. చార్జీల బోర్డు చిన్నగా ఉన్నందున రోగులకు స్పష్టంగా కనిపించే విధంగా నిర్దేశిత పరిమాణంలో ప్రదర్శించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ రోగుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు.

## ఇంటర్ ఎగ్జామ్ రోజు తండ్రి మృతి

### నెల్లూరులో హృదయ విదారక ఘటన

**నెల్లూరు, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**




విధి రాసిన అగ్ని పరీక్షలా మారిన ఒక హృదయ విదారక ఘటన ఏపీలోని నెల్లూరు డిస్ట్రిక్ట్ లో చోటుచేసుకుంది. సంగం మండల కేంద్రానికి చెందిన కందల శివకుమార్ ఆదివారం ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందాడు. శివకుమార్ పేద కుటుంబానికి చెందినవాడు. తనకు ఎదురైన కష్టాలు తన కుమారుడు ఎదుర్కొనకూడదనే తపనతో బాగా చదివించి మంచి స్థాయికి చేర్చాలని కలలు కనేవాడు. అతని కుమారుడు రామసాయి ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే సోమవారం ఉదయం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతున్న వేళ, ఇంట్లోనే తండ్రి మృతదేహం ఉండటం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఒక వైపు కన్నతండ్రి మృతి, మరో వైపు జీవితాన్ని మలిచే పరీక్ష---ఏది ముందో, ఏది తరువాతో తేల్చుకోలేని పరిస్థితిలో రామసాయి కన్నీరుమున్నీరయ్యాడు. పరీక్షలకు హాజరు కావాలా? లేక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనాలా? అనే సందిగ్ధంలో పడిన ఆ విద్యార్థి పరిస్థితి గ్రామస్తుల హృదయాలను కదిలించింది. ఈ ఘటన సంగం మండల్ లో జరిగింది. విధి ఇలా పరీక్ష పెట్టడం దురదృష్టకరం అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అగ్ని పరీక్ష మరెవరికీ రాకూడదని గ్రామస్థులు కోరుతున్నారు.

# చిన్నారుల చిత్రకళా ప్రదర్శన అలరింపు





### సాగంటి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

**హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రెండు తెలుగు రాష్ట్రాల చిన్నారుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో సాగంటి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన "సాగంటి ఆర్ట్ ఛాలెంజ్" విజయవంతంగా ముగిసింది. ఈ ఛాలెంజ్‌లో మొత్తం 436 మంది చిన్నారులు పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. వారం రోజుల పాటు చిన్నారులు రూపొందించిన చిత్రాలు, క్రాఫ్ట్ వర్క్‌లను ఒకే చోట ప్రదర్శిస్తూ "చిన్నారుల చిత్రకళా సంత" పేరిట ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. శనివారం వేములవాడ ఎస్.టి. వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కరీంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మంకమ్మ తోట)లో ప్రదర్శన ఏర్పాటు చేయగా, ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ళ వేణుమాధవ్ ఆడిటోరియంలో చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు, కళాకారులు వందల సంఖ్యలో సందర్శించి చిత్రాలను తిలకించారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను చూసి పెద్దలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ప్రశంసలు అందుకున్న చిన్నారులు ఆనందంతో ఉప్పొంగగా, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం అకాడమీ డైరెక్టర్ డా. మంజుల సాగంటి పాల్గొన్న ప్రతి చిన్నారి కళాకారుడిని కండువాతో సన్మానించి సర్టిఫికెట్, ట్రోఫీ, గోల్డ్ మెడల్ అందజేశారు. పిల్లల్లోని ప్రతిభను మరింత మెరుగుపరుచుకునేలా ప్రోత్సహిస్తూ వారికి ఉత్తేజం నింపారు. ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని, పిల్లల్లో సృజనాత్మకతతో పాటు ఏకాగ్రత పెంపొందించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వీక్షకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు చిప్పకుర్తి శ్రీనివాస్, అకాడమీ సలహాదారు నిమ్మల శ్రీనివాస్, హరిప్రసాద్ రావు, హరిప్రియ, ఆర్టిస్ట్ శిరీష, దేవిక, జయశ్రీ, రఘుపతి, హేమలత, కవిత, మానస, సంజన, సాయి, వెన్నెల, వర్ష, షైనీ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ డా. మంజుల సాగంటి కృతజ్ఞతలు తెలిపారు.

# కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే శిబిరం : 72 మందికి పరీక్షలు

**కమలాపూర్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కమలాపూర్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీ.హెచ్.సి)లో సోమవారం అత్యాధునిక హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే యంత్రంతో ఉచిత ఊపిరితిత్తుల పరీక్షల శిబిరం నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షయవ్యాధి (టీబీ) వంటి ఊపిరితిత్తుల వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యమని వైద్యులు తెలిపారు. రెండు వారాలకు పైగా దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారు, అలాగే వల్నరబుల్ వర్గాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే యంత్రం ప్రత్యేకత ఏమిటంటే, కృత్రిమ మేధ (ఛా×) సాంకేతికత సహాయంతో నిమిషాల్లోనే ఫలితాలు అందుబాటులోకి రావడం. దీంతో వ్యాధిని త్వరగా గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభించేందుకు వీలు కలుగుతుందని వైద్య సిబ్బంది వివరించారు. ఈ శిబిరంలో మొత్తం 72 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. అనుమానిత కేసులను గుర్తించి, అవసరమైన వారికి అదనపు పరీక్షలు సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం తరఫున ఉచితంగా మందులు



అందజేయనున్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో రేడియోగ్రాఫర్లు భాస్కర్, మహేష్, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. ప్రజలకు టీబీ లక్షణాలు, నివారణ చర్యలు, ప్రభుత్వ ఉచిత వైద్య సేవలపై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ, కమలాపూర్ మండల పరిధిలోని ప్రజలు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను వినియోగించుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో క్షయవ్యాధి వంటి ఊపిరితిత్తుల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని, ఇలాంటి శిబిరాలను తరచుగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

# "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన






### రోడ్డు ప్రమాదాలతో దేశ భవిష్యత్తైన యువతను కోల్పోతున్నాం: సన్‌ప్రీత్ సింగ్

**హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రోడ్డు నిబంధనలు పాటించకపోవడం వల్ల దేశ భవిష్యత్తైన యువత రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని సన్ ప్రీత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల చివరి వారం నిర్వహించే "అరైవ్ అలైవ్" రెండో విడత కార్యక్రమంలో భాగంగా వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హన్మకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కాలేజీలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలు, వాటిని ఉల్లంఘించినప్పుడు ఎదురయ్యే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, తన ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా ఇతరుల ప్రాణాల భద్రత కూడా తన బాధ్యత అని సూచించారు. థ్రిల్ కోసం వేగంగా వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, ఇటువంటి నిర్లక్ష్యంతో అనేక కుటుంబాలు అపార నష్టాన్ని చవిచూస్తున్నాయని తెలిపారు. గత సంవత్సరంలో హత్యలు, ఇతర కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 800 మంది మరణించగా, రోడ్డు ప్రమాదాల కారణంగా మాత్రమే 7,500 మంది మృతి చెందడం ఆందోళనకరమని చెప్పారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ అధికారులు విద్యార్థుల చేత ట్రాఫిక్ నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు వెంకన్న, సీతారెడ్డి, సుజాత, కళాశాల ప్రిన్సిపాల్ శేషాచలం, కరస్పాండెంట్ శ్రవణ్ రెడ్డి, హరిచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర-తెలంగాణ స్థానికత ఆధారంగా హోంగార్డుల బదిలీలకు విజ్ఞప్తి




**హైదరాబాద్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఆంధ్రప్రదేశ్ స్థానికతకు చెందిన హోంగార్డులను వారి సొంత రాష్ట్రానికి బదిలీ చేయాలని, అలాగే తెలంగాణ స్థానికత గల హోంగార్డులను తెలంగాణకు పంపించాలని హోంగార్డుల సంఘం రెండు రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హోంగార్డు ఉద్యోగాలకు ఎంపికైన తాము, రాష్ట్ర విభజన (జూన్ 2014) అనంతరం తెలంగాణలోనే కొనసాగాల్సి వచ్చిందని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులను స్థానికత ఆధారంగా పునర్విభజన చేసినప్పటికీ, హోంగార్డుల విషయంలో మార్పులు చేయలేదని వారు వాపోయారు. తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ స్థానిక హోంగార్డులు సుమారు 200 మంది ఉన్నారని, అలాగే ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు చెందిన హోంగార్డులు కూడా దాదాపు 200 మంది ఉన్నారని పేర్కొన్నారు. కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో మానసికంగా, కుటుంబపరంగా, రవాణా మరియు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల విద్య, స్థానికత సమస్యలు భవిష్యత్తులో ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సున్నితమైన అంశాన్ని రెండు రాష్ట్ర ప్రభుత్వాలు గమనించి పరస్పర బదిలీల ద్వారా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మేధావులు, ప్రజాసంఘాలు కూడా ఈ అంశంపై స్పందిస్తూ అల్పాదాయ వర్గానికి చెందిన హోంగార్డులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని హోంగార్డులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కాకతీయ యూనివర్సిటీ న్యూ పీజీ క్యాంపస్‌లో ఘర్షణ

### ఇరు వర్గాలపై కేసులు నమోదు





**హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ న్యూ పీజీ క్యాంపస్‌లో మెస్ నిర్వహణ అంశంపై ఎకనామిక్స్, ఎంబీఏ విభాగాలకు చెందిన విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీసులు ఇరు వర్గాలపై రెండు కేసులు నమోదు చేశారు. ఘటనలో ప్రతి వర్గం నుంచి సుమారు 10 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం కేసులపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సంఘటనపై సోమవారం హనుమకొండ ఏసీపీ, కేయూసీ ఎస్‌హెచ్‌వో, విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్, హాస్టల్ డైరెక్టర్ తదితర అధికారులు జోక్యం చేసుకున్నారు. ఇరు విద్యార్థి గుంపులతో వేర్వేరుగా సమావేశమై కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు హెచ్చరించారు. పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసులపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని, అకాడమిక్ పరంగా నిందితులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని విశ్వవిద్యాలయ అధికారులు స్పష్టం చేశారు. క్యాంపస్‌లో శాంతి భద్రతలు కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# గచ్చిబౌలిలో రూ.1.76 లక్షలు పలికిన చదరపు గజం భూమి

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో చదరపు గజం భూమి రూ.1.76 లక్షలు పలికింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హౌసింగ్ బోర్డు భూములను వేలం వేయగా అధిక ధరలు పలికాయి. కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఈ వేలంలో 50 మంది బిల్డర్లు పాల్గొన్నారు. గచ్చిబౌలి, బౌరంపేట, కూకట్ పల్లి బాలాజీనగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని మొత్తం 14 స్థలాలను బహిరంగ వేలం వేశారు. ఇందులో గచ్చిబౌలి భూమి చదరపు గజం రూ.1.76 లక్షలు, కూకట్ పల్లి బాలాజీనగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలు పలికింది. బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.34.27 కోట్ల ఆదాయం సమకూరింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)

"అత్యంత పూజనీయులు సంత్ సేవలాల్ మహారాజ్" అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ఆడిటోరియం ప్రాంగణంలో ఎస్సీ/ఎస్టీ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ. రాజు అధ్యక్షతన నిర్వహించిన "సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి -- మహా భోగ్ భండారో" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంజారా, గిరిజన సమాజాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ నేటి యువతకు ఆదర్శప్రాయ వ్యక్తిత్వమని కొనియాడారు. ప్రతి కుల, వర్గ పరిస్థితుల్లోనూ సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుచూపుతో పనిచేసిన మహనీయుడిగా ఆయనను అభివర్ణించారు. సమాజంలో సమానత్వం, న్యాయం, సేవాభావం వంటి విలువలను సేవలాల్ మహారాజ్ ప్రతిపాదించారని, వాటిని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆచార్య ఎ. సీతారాం నాయక్



మాట్లాడుతూ, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సంత్ సేవలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బంజారా లిపి, చరిత్రలను ప్రాచుర్యంలోకి తీసుకురావాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్ ఆచార్య గొనా నాయక్ మాట్లాడుతూ, సంత్ సేవలాల్ మహారాజ్ బోధనలు సామాజిక ఐక్యతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ఆచరణలో పెట్టినప్పుడే సమాజ పురోగతి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ ఎన్. సుదర్శన్, కాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## వరంగల్ భద్రకాళీ అమ్మవారిని దర్శించిన ఎంపీ బలరాం నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు





వరంగల్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)

వరంగల్ మహానగరంలోని చారిత్రాత్మక ప్రాధాన్యం గల శ్రీ భద్రకాళీ దేవస్థానంను సోమవారం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ దర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీకి ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న ఘనస్వాగతం పలికారు. పూజానంతరం ప్రధానార్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో అమ్మవారి చిత్రపటాలు ఏర్పాటు చేయుటకు రైల్వే జనరల్ మేనేజర్‌తో మాట్లాడి అనుమతి పొందేందుకు చర్యలు తీసుకోవాలని ధర్మకర్తలు ఎంపీని కోరారు. దీనికి స్పందించిన బలరాం నాయక్ గారు, వరంగల్ ఎంపీ కడియం కావ్యతో కలిసి రైల్వే అధికారులతో మాట్లాడి అనుమతి ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీనుబాబు ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ధర్మకర్తలు గౌడె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోత్కూరి మయూరి రామేశ్వరరావులు స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ మహామండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వంశీ తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్



హసన్ పర్తి, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)

వార్షిక, పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను సమగ్రంగా పరీక్షలకు సిద్ధం చేయాలని హసన్పర్తి మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం హసన్ పర్తి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలతో పాటు 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న వార్షిక పరీక్షలు కూడా అత్యంత ప్రాముఖ్యమైనవని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరీక్షలపై భయం తొలగించి, చదువుపై ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు చైతన్యవంతంగా పనిచేయాలని సూచించారు. ఇందుకోసం మాదిరి పరీక్షలు నిర్వహించడం, ముఖ్య అంశాలపై ప్రత్యేక పునశ్చరణ తరగతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న ప్రత్యేక తరగతుల మాదిరిగానే మిగతా తరగతుల విద్యార్థుల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవసరమైతే తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై పర్యవేక్షణ పెంచాలని, ఉపాధ్యాయులతో చర్చించి ప్రణాళికలు రూపొందించి వాటిని కచ్చితంగా అమలు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, రవికుమార్, రవీందర్ తదితరులు, మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఇటీవల జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవిని ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు.



## టీజీ ఎడ్‌సెట్-2026 షెడ్యూల్ విడుదల

వరంగల్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)



తెలంగాణ రాష్ట్రంలో 2026 విద్యా సంవత్సరానికి బి.ఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న టీజీ ఎడ్‌సెట్--2026 పూర్తి షెడ్యూల్‌ను కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసింది. టీజీ ఎడ్‌సెట్--2026 చైర్మన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి సోమవారం విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో షెడ్యూల్‌ను ప్రకటించారు. ఫిబ్రవరి 20న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓసీ/బీసీ అభ్యర్థులు రూ.750, ఎస్సీ/ఎస్టీ/పిహెచ్ అభ్యర్థులు రూ.550 పరీక్షా ఫీజు చెల్లించాలి. ఏప్రిల్ 15 చివరి తేదీగా నిర్ణయించారు. రూ.250 అపరాధ రుసుముతో ఏప్రిల్ 22 వరకు, మరో రూ.250 అపరాధ రుసుముతో ఏప్రిల్ 27 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 2 నుంచి దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుంది. మే 4న పరీక్షా కేంద్రాల కేటాయింపు జరుగుతుంది. రూ.5000 అపరాధ రుసుముతో మే 8, 9 తేదీలలో ప్రత్యేక అవకాశం కల్పించనున్నారు. హాల్ టికెట్లు మే 9 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. మే 12న ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు రెండు సెషన్లలో ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మే 15న ప్రాథమిక కీ విడుదల చేయబడుతుంది. మే 17 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. తుది ఫలితాలు మే 30న ప్రకటించబడతాయి. ఈ సమావేశంలో కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య ఎన్. రామనాథ కిషన్, ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. టీజీ ఎడ్‌సెట్--2026 అధికారిక వెబ్‌సైట్‌ను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

## టీజీ ఎడ్‌సెట్-2026కు 16 నగరాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు




హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)

టీజీ ఎడ్‌సెట్--2026 ప్రవేశ పరీక్ష నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 16 నగరాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి వెల్లడించారు. కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నగరాన్ని నాలుగు భాగాలుగా విభజించి ప్రత్యేక పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదనంగా నల్గొండ, కోదాడ, ఖమ్మం, భద్రాచలం (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా), సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, సిద్దిపేట నగరాల్లో కూడా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా కేంద్రాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ భద్రతా ఏర్పాట్లు, సాంకేతిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నామని వెల్లడించారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ హాల్‌టికెట్ మరియు పరీక్షా కేంద్ర వివరాలు తెలుసుకుని సూచనలు పాటించాలని సూచించారు.

# వరంగల్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

21 మందికి రూ. 28,600 జరిమానా విధింపు




వరంగల్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ప్రత్యేక తనిఖీలలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన 21 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి రాజ్ నిధి గారు విచారణ జరిపి మొత్తం రూ. 28,600 జరిమానా విధించారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె. సుజాత మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికమని తెలిపారు. రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని వాహనదారులను సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు.

## తెలంగాణా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సభ్యునిగా ఆచార్య గాదె దయాకర్



హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయంకు చెందిన విశ్రాంత రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య గాదె దయాకర్ తెలంగాణా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ సభ్యునిగా ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధన అవకాశాల విస్తరణ తదితర అకాడమిక్ అంశాలపై వారు విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆచార్య గాదె దయాకర్ అనుభవం విశ్వవిద్యాలయానికి మరింత గౌరవాన్ని తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు. ఆచార్య గాదె దయాకర్ నియామకాన్ని అభినందించిన వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి గారు, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంతో కలిసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. విశ్వవిద్యాలయానికి గౌరవం తీసుకువచ్చిన ఈ నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన భవిష్యత్ సేవలు రాష్ట్రానికి మేలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని ఆచార్య గాదె దయాకర్ ని అభినందించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: డా. సత్య శారద





**వరంగల్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికైన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును స్వయంగా పరిశీలించిన కలెక్టర్, దరఖాస్తుదారుల సమక్షంలోనే సంబంధిత శాఖాధికారులతో చర్చించి, సమస్యలను వేగంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరిష్కారం సాధ్యంకాని దరఖాస్తుల విషయంలో అభ్యర్థులకు స్పష్టమైన కారణాలు తెలియజేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 150 దరఖాస్తులు అందాయి. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 56, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందినవి 38, ఇతర శాఖలకు సంబంధించినవి 56 దరఖాస్తులు ఉన్నాయి. రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నందున వాటిని సంబంధిత తహసీల్దార్లకు పంపించి నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. వృద్ధులు, సామాజిక సంక్షేమం, పింఛన్లకు సంబంధించిన వినతులను శిశు సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులకు ఎండార్స్ చేస్తూ మానవీయ దృక్పథంతో త్వరిత పరిష్కారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి అనంతరం జిల్లాలో కొనసాగుతున్న "స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ మ్యాపింగ్" కార్యక్రమంపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. భూసంబంధిత రికార్డుల ఖచ్చితత్వం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసి, ఎలాంటి పొరపాట్లు లేకుండా గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు, డిఎంహెచ్ఓ డా. సాంబశివరావు, హౌసింగ్ పీడీ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**




**హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులను అధికారులు పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, ఇతర అధికారులతో కలిసి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు 165 వినతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని పి ఐ ఓ లు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టానికి సంబంధించిన దరఖాస్తులు కూడా పెండింగ్ లో ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులను పబ్లిక్ డోమైన్ లో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

**వరంగల్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరి 25, 26 తేదీలలో నిర్వహించాల్సిన పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన పరీక్షల్లో నాన్-ప్రొఫెషనల్ కోర్సులు అయిన ఎం.ఏ., ఎం.ఎస్సి., ఎం.కామ్. తో పాటు ప్రొఫెషనల్ కోర్సులు అయిన ఎంబీఏ, ఎంసీఏ కూడా ఉన్నాయి. అనివార్య కారణాల వల్ల ఈ పరీక్షలను వాయిదా వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. వాయిదా పడిన పరీక్షలను తిరిగి ఎప్పుడు నిర్వహించనున్నారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిపారు. పరీక్షల కొత్త తేదీలకు సంబంధించిన పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని, విద్యార్థులు మరియు అనుబంధ కళాశాలల యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి, తదుపరి ప్రకటన కోసం అధికారిక సమాచారాన్ని మాత్రమే ఆధారంగా తీసుకోవాలని అధికారులు సూచించారు.



OFFICE OF THE CONTROLLER OF EXAMINATIONS
KAKATIYA UNIVERSITY: WARANGAL (T.G.)
Accredited with 'A+' Grade by NAAC
Phone: (+91) 0870-2438822 (Landline), www.kuexams.org, E-mail: controller.exams@kakatiya.ac.in

No. 145 /COEP/KU/2026 Date:23-02-2026

PRESS NOTE

It is hereby informed that the M.A.(Hindi, English, Telugu, Sanskrit, Sociology, Political Science, Public Administration, History, Economics, Journalism and Mass Communication), M.Com.(General, FA, CA & B&I) M.Sc.(Chemistry, Physics, Mathematics, Applied Mathematics, Botany, Zoology, Geology, Biotechnology, Microbiology, Statistics, Biochemistry, Psychology, Sericulture and Computer Science, Food Science & Technology, Nutrition &Dietetics) MTM, MSW, MHRM and M.Lib.I.Sc. I-Year I – Semester, M.B.A I-Year: I –Semester and M.C.A I-Year I – Semester Examinations of Kakatiya University has already been scheduled on 25-02-2026 is postponed. The revised schedule will be announced later.

Controller of Examinations
Controller of Examinations
Kakatiya University
WARANGAL - 506 009, (T.S.)

## పెన్షనర్ల ఆవేదనతో హనుమకొండ కదిలింది

**రిటైర్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం**

**హన్మకొండ, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**






రిటైర్మెంట్ అనంతరం ప్రశాంత జీవితం గడపాల్సిన పెన్షనర్లు నేడు బకాయిల కోసం నిరాహార దీక్షలకు దిగాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ తెలంగాణ (ఎస్.జి.పి.ఏ.టి) పిలుపు మేరకు హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖలు సంయుక్తంగా హనుమకొండలోని ఏకశిలా పార్కు వద్ద ఒకరోజు నిరాహార దీక్షను ఘనంగా నిర్వహించాయి. రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మార్చి 2024 నుండి జనవరి 2026 వరకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. నిరాహార దీక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ వెలిశోజు రామ మనోహర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. వీరస్వామి ప్రారంభించారు. ముందుగా బకాయిలు అందక మానసిక వేదనతో, ఆరోగ్యం క్షీణించి మృతి చెందిన పెన్షనర్లకు సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. "పెన్షనర్ల ప్రాణాలు కాపాడండి -- బకాయిలు వెంటనే చెల్లించండి" అంటూ నినాదాలు మార్మోగాయి. వెలిశోజు రామ మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇ. నరసింహారెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు తుమ్మ వీరయ్య సహా పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ గత 23 నెలలుగా ప్రభుత్వం రిటైర్మెంట్ బకాయిల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 21 వేల మంది ఉద్యోగులు రిటైర్ కాగా, అందులో దాదాపు 18 వేల మంది కుటుంబాలు ఇంకా బకాయిల కోసం ఎదురు చూస్తున్నాయని తెలిపారు. బకాయిలు అందకపోవడంతో అనేక మంది పెన్షనర్లు ఆర్థికంగా కుంగిపోయి, వైద్య చికిత్సలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు 72 మంది పెన్షనర్లు బకాయిలు రాక మానసిక వేదనతో, ఆరోగ్య సమస్యలతో మృతి చెందినట్లు సంఘం నాయకులు వెల్లడించారు. "రిటైర్మెంట్ బకాయిలు ఇవ్వకపోవడం పెన్షనర్లపై మానసిక హింసే" అని వారు మండిపడ్డారు.

**సంఘం ప్రభుత్వాన్ని ఉద్దేశించి పలు కీలక డిమాండ్లు చేసింది..**

పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బకాయిలన్నింటిని తక్షణమే విడుదల చేయాలి. పెండింగ్‌లో ఉన్న నాలుగు డి.ఏలను వెంటనే ప్రకటించాలి. పీఆర్సీ 2023 నివేదికను సమర్పించి అమలు చేయాలి. నగదు రహిత హెల్త్ కార్డుల్లో పెన్షనర్ల నుండి కేవలం 1% కాంట్రిబ్యూషన్ మాత్రమే వసూలు చేయాలి. ఈ.పి.హెచ్.ఎస్ కమిటీలో ఆరుగురు పెన్షనర్లకు సభ్యత్వం కల్పించాలి. దీక్షకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రావుల పద్మ, హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హాజరై మద్దతు తెలిపారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి శాసనసభలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. మార్చి 1లోపు ప్రభుత్వం స్పందించకపోతే మార్చి 2 నుండి 5 వరకు నాలుగు రోజులపాటు నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు--- హనుమకొండ ఎస్‌టిఓ ప్రధాన కార్యదర్శి కందుకూరి దేవదాసు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, ఎన్జీవో నాయకులు పుల్లూరు వేణుగోపాల్, డిటిఎఫ్ నాయకులు కే. శ్రీనివాస్, టిపిటిఎఫ్ శ్రీరామ్, యూటీఎఫ్ నాయకులు టి. కుమార్ తదితరులు ఈ ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించారు. సుమారు 250 మందికి పైగా పెన్షనర్లు, సంఘాల ప్రతినిధులు ఈ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని ఎస్.జి.పి.ఏ.టి నాయకులు హెచ్చరించారు. "రిటైర్మెంట్ తర్వాత గౌరవప్రదమైన జీవితం అందించాల్సిన ప్రభుత్వం, పెన్షనర్లను వీధుల్లోకి తెచ్చే పరిస్థితి రావడం దురదృష్టకరం. ఇప్పటికైనా ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి బకాయిలు విడుదల చేయాలి" అని నాయకులు స్పష్టం చేశారు.

## హసన్‌పర్తిలో అజోలా (సాంద్రియ ఎరువు)పై విస్తృత అవగాహన సదస్సు - గ్రామ ప్రజలకు పంపిణీ



**హసన్‌పర్తి, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తిలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సమైక్య గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు అజోలా (సాంద్రియ ఎరువు)పై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించి, అనంతరం అజోలా మొక్కలను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సేంద్రీయ వ్యవసాయం, పశుసంవర్ధక రంగ అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సదస్సుకు గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రైతులు రసాయన ఎరువులపై ఆధారపడకుండా సేంద్రీయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. అజోలా వంటి జీవ ఎరువులు నేల ఉరుకును పెంచడమే కాకుండా పంటల దిగుబడిని కూడా మెరుగుపరుస్తాయని తెలిపారు. ఉపసర్పంచ్ భుక్య అరుణ్, వార్డు సభ్యులు కూడా పాల్గొని గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డా. డి. విజయలక్ష్మి మాట్లాడుతూ, ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ద్వారా విద్యార్థినుల్లో సేవాభావం పెంపొందించడమే కాకుండా సమాజానికి ఉపయోగకరమైన అంశాలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని చెప్పారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో విద్యాసంస్థలు భాగస్వాములు కావడం సంతోషకరమని ఆమె పేర్కొన్నారు. వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డి.డి. స్నేహంతో అజోలా సాగు విధానం, పెంపకం పద్ధతులు, తక్కువ స్థలంలోనే సాగు చేయగల సామర్థ్యం, పశువుల మేతగా దాని ప్రాధాన్యం వంటి అంశాలను సవివరంగా వివరించారు. అజోలా వల్ల పాలు ఉత్పత్తి పెరుగుతుందని, పశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆమె తెలిపారు. అలాగే అజోలా తయారీకి అవసరమైన ట్యాంక్ నిర్మాణం, నీటి నిర్వహణ, పోషకాలు కలపడం వంటి సాంకేతిక వివరాలను కూడా వివరణాత్మకంగా చెప్పారు. కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజలకు మరియు ఆసక్తి ఉన్న రైతులకు అజోలా నమూనాలను పంపిణీ చేశారు. గ్రామస్థులు ఈ కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్. మాధవి, ఎన్‌ఎస్‌ఎస్ సభ్యురాలు డా. బి. హర్చన, అధ్యాపక బృందం, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మరియు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సేంద్రీయ వ్యవసాయంపై గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం పెంపొందించడంలో ఈ అవగాహన సదస్సు ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.

## తెలంగాణ ప్రభుత్వం - చెనేత మరియు జౌళి శాఖ ప్రత్యేక ప్రకటన

**చేనేత కార్మికులకు జిల్లా వారీగా దరఖాస్తుల ఆహ్వానం**



**వరంగల్, 23 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం చెనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లాలోని చెనేత కార్మికులకు తగిన ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అర్హత గల చెనేత కార్మికులు 07-08-2026 లోపు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఎంపికైన వారికి చెనేత డిజైనర్ ద్వారా వివిధ నమూనాలు, శైలులు, మెటీరియల్ సప్లై వంటి అంశాల్లో శిక్షణ అందించనున్నారు. అదేవిధంగా అర్హులైన వారికి రూ.25,000 ఆర్థిక సాయం మంజూరు చేయబడుతుంది.

**అర్హతలు...**

31-12-2025 నాటికి కనీసం 30 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. చెనేత రంగంలో కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి. చెనేత డిజైనర్‌లకు 31-12-2025 నాటికి 25 సంవత్సరాల వయస్సు ఉండి, కనీసం 5 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. దరఖాస్తులు నిర్ణీత నమూనా ప్రకారం 31-03-2026 లోపు సంబంధిత మండల కార్యాలయాలలో సమర్పించాలి. ఇప్పటికే వృత్తి నిర్వహిస్తున్న చెనేత కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. 15-05-2026 తర్వాత వచ్చిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవు. అభ్యర్థులు పూర్తి వివరాలతో పాటు అవసరమైన ధృవపత్రాలు జతచేసి చెనేత, జౌళి శాఖ, వరంగల్ జిల్లా కార్యాలయంలో సమర్పించాలని అధికారులు తెలిపారు.

## హైదరాబాద్ మెట్రో రైలుపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

**హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం**
**ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం**
**రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం ఈరోజు నిర్ణయించింది. మెట్రో రైలు స్వాధీనంపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులతో ఈ ఉపసంఘాన్ని నియమించింది. గత సంవత్సరం సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించాలని, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చాయి. నాటి నుంచి స్వాధీన ప్రక్రియ ప్రారంభమైంది.

జై భీమ్ POWER OF PEOPLE

# ఆ విషయంలో బీఆర్ఎస్ ఫెయిల్ అయింది..

**జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం: కవిత**
**జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత**
**భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ**
**నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు. కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు. జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు. సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు. నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వాలతో పని చేయించడం కోసమే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరు ఏమిచ్చినా తీసుకోవాలని, కానీ పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని, అప్పుడు డబ్బులు ఇచ్చినా తీసుకోవాలని, కానీ మీకోసం కొట్లాడే జాగృతి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఈ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు.



# ఎమ్మెల్యే మాధవరం ఆరోపణలను ఖండించిన హైడ్రా

**సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు మారబోవని చెప్పిన హైడ్రా**
**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణల్లో నిజం లేదని స్పష్టీకరణ**
**2014లో నిర్ధారించిన హద్దుల ప్రకారమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి**
**ఆక్రమణలకు గురైన చెరువును 31 ఎకరాలకు విస్తరించామని వెల్లడి**
**పేదలకు అన్యాయం, పెద్దలకు రక్షణ కల్పించే ఉద్దేశం లేదని స్పష్టత**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

మాదాపూర్‌లోని సున్నం చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదని హైడ్రా స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. చెరువు అభివృద్ధి పనులను అత్యంత శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపడుతున్నామని, ఇందులో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని ఒక ప్రకటనలో పేర్కొంది. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 2014 మే నెలలోనే నిర్ధారించారని, ఆ సరిహద్దుల మేరకే ప్రస్తుతం పనులు చేపడుతున్నామని హైడ్రా వివరించింది. ఈ పనుల్లో పేదలకు అన్యాయం చేయడం గానీ, పెద్దలను కాపాడటం గానీ జరగడం లేదని తేల్చిచెప్పింది. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ధారణ ప్రకారం 31 ఎకరాలకు విస్తరించిన విషయాన్ని గుర్తుచేసింది. ఇరిగేషన్, రెవెన్యూ వంటి సంబంధిత శాఖల సమన్వయంతోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని తెలిపింది. సోమవారం సున్నం చెరువును సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు, అక్కడే ఉన్న ఇరిగేషన్ అధికారులు వాస్తవాలను వివరించారని హైడ్రా పేర్కొంది. 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ణయించిన జియో కో-ఆర్డినేట్స్ (అక్షాంశాలు, రేఖాంశాలు) ప్రకారమే ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు శాశ్వతమైనవని, వాటిని మార్చే ప్రసక్తే లేదని హైడ్రా తన ప్రకటనలో పునరుద్ఘాటించింది. ఈ విషయంలో అనవసర అపోహలు సృష్టించవద్దని కోరింది. చెరువు అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్

**కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు**
**తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ**
**ఎవరైనా పని చేయాలనుకుంటే బీఆర్ఎస్ పార్టీలో కలిసి పని చేయాలని సూచన**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చిరు జల్లులు

**నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్ల వర్షాలు**
**మధ్యాహ్నం వరకు ఎండ... ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం**
**ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ తదితర ప్రాంతాల్లో వర్షం**




హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్నాయి. ఇలాంటి తరుణంలో హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్ల వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, కాచిగూడ, కొండాపూర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మాసాబ్ ట్యాంకు తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కాగా, నిజామాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, సిద్దిపేట, వికారాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# ఎల్లుండి నుంచి తెలంగాణ ఇంటర్ పరీక్షలు

**బోర్డు సెక్రటరీ కీలక సూచనలు**
**ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు**
**రెండు సంవత్సరాలు కలిపి పరీక్షలు రాస్తున్న 9,97,075 మంది విద్యార్థులు**
**పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలన్న కృష్ణాదిత్య**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న ఈ పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు సెక్రటరీ, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారు. ఇందులో మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కాలేజీలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు 7 ఇతర విద్యా సంస్థలను సెంటర్లుగా ఎంపిక చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కాలేజీల్లో అధికంగా సెంటర్లు ఉండగా, మిగిలిన జిల్లాల్లో ఎక్కువగా ప్రభుత్వ కళాశాలలనే ప్రాధాన్యతలోకి తీసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు ఏమాత్రం అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించబోతున్నామని, ప్రతి సెంటర్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణాదిత్య తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని ఆయన సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని... కానీ, ఆ ఆందోళన వల్ల విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని, అందుకే నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను బయటకు పంపమని, పరీక్షా పత్రాలను కూడా అప్పటి వరకు బయటకు తీసుకెళ్లకూడదని చెప్పారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు లేదా మాల్ ప్రాక్టీస్ జరిగితే నిర్ణయం తీసుకోవడానికి ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఇక హాల్ టికెట్ల విషయంలో తలెత్తిన వివాదాలపై కూడా ఆయన స్పష్టతనిచ్చారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా, అందరికీ హాల్ టికెట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోర్టుకు వెళ్లిన విద్యార్థులకు కూడా ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

# డిగ్రీ కాలేజీ భూముల వ్యవహారం

**షబ్బీర్ అలీకి వెంకటరమణారెడ్డి ఛాలెంజ్**
**ఒక్క గజం భూమిని ఆక్రమించినట్లు నిరూపించినా పదవి వదులుకుంటానన్న వెంకటరమణారెడ్డి**
**అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ మండిపాటు**
**పోలీసుల తీరును కూడా తప్పుపట్టిన వైనం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

డిగ్రీ కళాశాల భూముల వ్యవహారం ఇప్పుడు కామారెడ్డి రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ భూముల అంశంలో తనపై వస్తున్న అవినీతి ఆరోపణలను కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహా నిరూపిస్తే, తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి బహిరంగ సవాల్ విసిరారు. ఈ వివాదంపై పూర్తి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతూ ఆయన ఈరోజు కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి, కళాశాల భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వెంకటరమణారెడ్డి... షబ్బీర్ అలీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సత్యదూరమైన విషయాలను ప్రచారం చేస్తూ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. డిగ్రీ కళాశాల భూముల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఇప్పటికే తాము ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేశామని, ప్రభుత్వం నుంచి సమాచారం రాగానే అన్ని విషయాలు బహిర్గతం అవుతాయని స్పష్టం చేశారు. "కాలేజీ భూముల విషయంలో నేను ఒక్క గజం భూమినైనా ఆక్రమించినట్లు లేదా అవినీతి చేసినట్లు నిరూపించినా పదవి వదులుకోవడానికి సిద్ధం" అని ఆయన సవాల్ విసిరారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతోనే తాను ఇప్పటివరకు ఓపికతో ఉన్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పోలీసుల తీరుపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలవడానికి వస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులను పోలీసులు అడ్డుకుంటున్నారని, ఇదే నిబంధన కాంగ్రెస్ నాయకులకు ఎందుకు వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఈ భూముల వ్యవహారంలో పక్కా ఆధారాలతో నిజాలను ప్రజల ముందు ఉంచుతామని, అప్పటి వరకు అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు.



## విజయ్, రష్మిక పెళ్లి కన్ఫర్మ్..
# పీసీసీ చీఫ్‌కు ఆహ్వాన పత్రిక!

**పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు విజయ్-రష్మిక పెళ్లి ఆహ్వానం**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, ప్రముఖ నటి రష్మిక మందన్నల పెళ్లి వార్తలపై పూర్తి స్పష్టత వచ్చింది. వీరిద్దరూ త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నట్లు అధికారికంగా ఖరారైంది. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను తెలంగాణ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌కు అందజేశారు. సోమవారం నాడు మహేశ్ గౌడ్ నివాసంలో, విజయ్ దేవరకొండ బాబాయి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ్, రష్మికల పెళ్లికి రావాల్సిందిగా కోరుతూ శుభలేఖను అందించారు. దీంతో కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లి గురించి సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి తెరపడినట్లయింది.


# కందిపప్పు ఎక్కువగా తింటున్నారా..?



మన రోజువారీ ఆహారంలో కందిపప్పు ముఖ్యమైన భాగం. కానీ ఇటీవల కల్తీ సమస్య పెరుగుతోంది. కేసరి పప్పు అనే విషపూరిత పదార్థాన్ని దీనిలో కలుపుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది అంటున్నారు. మన ఆహారంలో ప్రోటీన్ ప్రధానమైన మూలకం. దానిని అందించేవాటిలో పప్పులు ముఖ్యమైనవి. అందులోను కందిపప్పు మన భారతీయ ఆహారంలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా సాంబార్, పప్పు కూరలు తయారీలో కందిపప్పును విరివిగా ఉపయోగిస్తారు. కానీ ప్రస్తుతం దీనిలో కల్తీ ఎక్కువవుతోందనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. కేసరి పప్పు అనే రసాయనాలతో కలిపిన విషపూరిత పప్పును కల్తీ చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరమని, దీని వల్ల తీవ్రమైన నరాల సమస్యలు, క్యాన్సర్ వంటి జబ్బులు వస్తాయని సూచిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో మార్కెట్లో లభిస్తున్న కందిపప్పులో కేసరి పప్పును కలుపుతున్నట్లు గుర్తించారు. ఈ కేసరి పప్పు అసలు తినదగినది కాదు. ఇది కలుపు మొక్కల ద్వారా పెరిగే విషపూరిత పదార్థం. దీన్ని తినడం వల్ల ముఖ్యంగా నరాల వ్యవస్థ దెబ్బతింటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఎక్కువగా తింటే కాళ్లు, చేతులు నెమ్మదిగా పని చేయకపోవడం, నడవలేకపోవడం లాంటి సమస్యలు వస్తాయి. దీన్ని లాథిరిజం అని అంటారు. దీని ప్రభావం శాశ్వతంగా ఉండే ప్రమాదం ఉంది. అంతేకాకుండా వ్యాపారులు ఈ కల్తీని గుర్తించకుండా ఉండేందుకు టార్ట్రాజిన్ అనే రసాయనాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది ఒక రకమైన ఆహార రంగు పదార్థం. దీని వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. దీని ప్రభావం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. కేసరి పప్పు కందిపప్పును పోలి ఉంటుంది. అయితే దీని ఆకారం కొద్దిగా చతురస్రాకారంలో ఉంటుంది. కొంతమంది వ్యాపారులు తక్కువ ధరలో లభించే ఈ పప్పును అసలు కందిపప్పులో కలిపి అమ్ముతున్నారు. దీని వల్ల సామాన్య వినియోగదారులకు అసలు పప్పు, కల్తీ పప్పు మధ్య తేడా గుర్తించడం కష్టం అవుతోంది. ఇంట్లోనే ఈ పప్పులో కల్తీ ఉందో లేదో సులభంగా పరీక్షించుకోవచ్చు. దాని కోసం 10 గ్రాముల పప్పులో 25 మి.లీ నీరు పోసి, 5 మి.లీ హైడ్రోక్లోరిక్ ఆమ్లం వేసి చిన్న మంటపై వేడి చేయాలి. ఈ ప్రక్రియలో నీటి రంగు మారితే ఆ పప్పులో కల్తీ ఉందని అర్థం. అదనంగా సహజమైన కందిపప్పు నునుపుగా, గుండ్రంగా ఉంటుంది. అయితే కల్తీ కేసరి పప్పు త్రికోణాకారంలో ఉండే అవకాశం ఉంది. ప్రతిరోజు మనం తినే ఆహార పదార్థాలు మానవ ఆరోగ్యానికి ముప్పు కలిగించకూడదు. కాబట్టి నాణ్యమైన పప్పును మాత్రమే కొనుగోలు చేయాలి. గుర్తింపు పొందిన బ్రాండ్‌లను ఉపయోగించడం ఉత్తమం. మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాణ్యత లేని పప్పులను కొనడం మానుకోవాలి.

# పుచ్చకాయలోని తెల్లని భాగం పొరబాటున ఎప్పుడైనా తినేశారా?

చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. వేసవిలో ప్రకృతి ప్రసాధించిన అద్భుత వరం పుచ్చకాయ. పండ్ల రారాజు మామిడి, లిచీ, పుచ్చకాయ వంటి అన్ని రకాల పండ్లు ఈ కాలంలో అధికంగా వస్తాయి. ముఖ్యంగా వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడంలో పుచ్చకాయకు మించిన ప్రత్యామ్నయం మరొకటి లేదు. అయితే మనలో చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. ఇందులో సిట్రుల్లైన్ అనే ఒక రకమైన అనావశ్యక అమైనో ఆమ్లం ఉంటుంది. పుచ్చకాయలోని తెల్లని భాగం తినడం వల్ల శరీరంలో దీని స్థాయి పెరుగుతుంది. సిట్రులిన్ మన రక్త నాళాలను విస్తరిస్తుంది. యుఎస్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధన ప్రకారం సిట్రుల్లైన్ కండరాలకు ఆక్సిజన్ అందిస్తుంది. ఫలితంగా పనితీరు పెరుగుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ హైపర్‌టెన్షన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. పుచ్చకాయలోని తెలుపు, ఇతర భాగాలు పెద్దలలో అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. పుచ్చకాయ తొక్కలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు అనేక ప్రయోజనాలను కలిగి ఉంటాయనే సంగతి తెలిసిన విషయమే. ఫైబర్ ప్రేగు కదలికలకు సహాయపడుతుంది. పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు త్వరగా కడుపు నింపుతాయి. ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తాయి. బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.



# డయాబెటిస్‌తో బాధపడుతున్నారా?

డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఈ రోజుల్లో హై బ్లడ్ షుగర్ లేదా డయాబెటిస్ సమస్య చాలా మంది వ్యక్తులలో సాధారణంగా కనిపిస్తోంది. ఈ వ్యాధికి పూర్తి స్థాయి నివారణ లేనప్పటికీ దీనిని నియంత్రణలో ఉంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి ప్రజలు అనేక రకాల ఇంటి చిట్కాలను పాటిస్తారు. మందులను ఉపయోగిస్తారు. అయితే, ఉల్లిపాయలు తినడం కూడా డయాబెటిస్ రోగులకు చాలా మేలు చేస్తుందని తెలుసుకోవడం ఆసక్తికరం. ఉల్లిపాయల్లో ఫోలేట్, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఉల్లిపాయలను వంటలో వేసుకుని తినవచ్చు. కానీ పచ్చి ఉల్లిపాయలు తినడం ఇంకా ఎక్కువ ప్రయోజనకరం. ఉల్లిపాయల్లో ఉండే క్వెర్సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్ గుణం రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని తినడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచవచ్చు. ఉల్లిపాయల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉన్న ఆహార పదార్థాలు డయాబెటిస్ రోగులకు ఎంతో మంచివి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచవు. అందుకే పచ్చి ఉల్లిపాయలను నిరభ్యంతరంగా తినవచ్చు. డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఉల్లిపాయల్లోని సల్ఫర్ సమ్మేళనాలు, యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో, బరువు తగ్గడంలో కూడా ఉల్లిపాయలు ఉపయోగపడతాయి. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. డయాబెటిస్ రోగులకు బరువును నియంత్రణలో ఉంచడం చాలా ముఖ్యం. ఉల్లిపాయలను కూరల్లో




కలిపి తినవచ్చు లేదా సలాడ్‌గా కూడా సేవించవచ్చు. డయాబెటిస్ రోగులకు ఉల్లిపాయలు ఒక సహజమైన, సులభమైన ఆహార ఎంపిక. దీనిని రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. అయితే ఏదైనా కొత్త ఆహారాన్ని డైట్‌లో చేర్చే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ముఖ్యంగా డయాబెటిస్‌తో ఇబ్బంది పడేవారు వైద్యులను సంప్రదించాలి.

## ఈ పండ్లు తింటే జీవితంలో గుండె జబ్బులు రావ్..




నేటి కాలంలో ఆరోగ్యంగా ఉండటం పెను సవాలే. మారిన జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరినీ హడలెత్తిస్తున్న ప్రధాన సమస్య గుండె సమస్యలు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దీని బారీన పడుతున్నారు. నేటి కాలంలో గుండె జబ్బులు పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరినీ ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటికే ఎంతో మంది యువకులు, చిన్న పిల్లలు గుండెపోటుతో మృతి చెందారు. దీనికంతటికీ కారణం మనం తినే ఆహారాలు, మన తప్పుడు దిన చర్యలే కారణం అంటున్నారు నిపుణులు. అందువల్ల, గుండె జబ్బులను ఎలా నివారించాలో నిపుణులు కొన్ని సలహాలు ఇస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదం చేసే 5 రకాల పండ్లు ఇవే. బ్లూబెర్రీస్‌లో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. రక్తపోటును తగ్గిస్తుంది. యాపిల్స్ ఫైబర్ కు మంచి మూలం. గుండెకు మేలు చేసే ఆమ్లాలు ఇందులో అధికంగా ఉంటాయి. పెక్టిన్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను సక్రమంగా ఉంచుతుంది. ప్రతిరోజూ ఒక ఆపిల్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దానిమ్మ గుండె ఆరోగ్యానికి మేలు చేసే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. దీన్ని తినడం రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. గుండె సామర్థ్యం పెరుగుతుంది. రక్తపోటు, పిత్త సమతుల్యతను కాపాడుకోవడం సాధ్యమవుతుంది.అవకాడోలు గుండెకు ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులతో నిండి ఉంటాయి. ఇందులో పొటాషియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇందులో ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడో జీర్ణక్రియ, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది.

## ఈ సమస్యలు ఉన్నవారు ఖర్జూర పండ్లు తినకూడదు..!



ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి సంబంధించిన అనేక తీవ్రమైన సమస్యలు తొలగిపోతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో ఖర్జూరాన్ని చేర్చుకోవాలని సలహా ఇస్తారు. నిపుణుల ప్రకారం.. సరైన మోతాదులో సరైన విధానంలో ఈ డ్రై ఫ్రూట్‌ను ఆహార ప్రణాళికలో చేర్చుకుంటే మొత్తం ఆరోగ్యం చాలా వరకు మెరుగుపడుతుంది. అయితే, ఖర్జూరం తినడం వల్ల కొందరి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం కూడా పడవచ్చు. అందువల్ల కొన్ని సందర్భాల్లో ఈ వారు ఖర్జూరాన్ని ఆహారంలో తీసుకోకుండా ఉండాలి. ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. అలాగే, అధిక మోతాదులో ఖర్జూరం తీసుకోవడం వల్ల మీ బరువు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి ఊబకాయం నుండి విముక్తి పొందాలనుకుంటే ఖర్జూరం తినడం మానుకోవడం మంచిది. డయేరియా సమస్యతో బాధపడుతున్న రోగులు కూడా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకుండా ఉండాలి. ఖర్జూరంలో ఉండే కొన్ని పదార్థాలు డయేరియా సమస్యను మరింత పెంచే పని చేస్తాయి. అంతేకాకుండా అధిక మోతాదులో ఖర్జూరం తినడం వల్ల మలబద్ధకం సమస్య కూడా పెరగవచ్చు. గర్భం దాల్చిన సమయంలో ఆహారం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. ఇలాంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు కూడా ఎక్కువగా ఖర్జూరం తినకూడదు. వైద్యుడి సలహా లేకుండా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకపోవడమే మంచిది. అంతేకాకుండా ఖర్జూరం తినడం వల్ల అలర్జీ ఉంటే ఈ డ్రై ఫ్రూట్‌ను మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే కొన్ని పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. దీన్ని సమతుల్యంగా తీసుకుంటే శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరంగా చూద్దాం!

## రాత్రి భోజనంలో అన్నం తింటున్నారా?



దాదాపు ప్రతి ఇంటిలోనూ అన్నం ప్రధాన ఆహారం. చాలా మంది మధ్యాహ్నం, రాత్రి భోజనానికి అన్నం తినడానికి ఇష్టపడతారు. కానీ రాత్రిపూట అన్నం తినడం ఆరోగ్యానికి మంచిదా? అనే సందేహం పలువురికి ఉంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బియ్యం మన శరీరానికి శక్తిని, అవసరమైన పోషకాలను అందిస్తున్నప్పటికీ రాత్రిపూట ఆలస్యంగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. బియ్యంలో సాధారణంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది శరీరానికి శక్తిని ఇస్తుంది. అయితే రాత్రిపూట మన శారీరక శ్రమ చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి, కార్బోహైడ్రేట్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు పేరుకుపోతాయి. అంతేకాకుండా నిద్రలో శరీర జీవక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల అదనపు కేలరీలను బర్న్ చేయడం కష్టమవుతుంది. ఇది కాలక్రమేణా బరువు పెరగడానికి దారితీస్తుంది. తెల్ల బియ్యం అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటాయి. దీని అర్థం ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి రాత్రి భోజనంలో అన్నం తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. కాలక్రమేణా ఇది టైప్ 2 డయాబెటిస్, ఇతర జీవక్రియ రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మంచి ఆహారాన్ని ఎంచుకోవడం రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి మంచి మార్గం. చాలా మందికి రాత్రి భోజనంలో అన్నం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా బియ్యంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో జీర్ణక్రియ సరిగా లేని వారికి, రాత్రి భోజనానికి అన్నం తినడం వల్ల ఆమ్లత్వం, ఆపాన వాయువు ఏర్పడతాయి. ఇది మీ నిద్రను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. బియ్యంలో నిద్రను ప్రోత్సహించే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉండటం వల్ల ఇది శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రాత్రిపూట క్రమం తప్పకుండా అన్నం తినడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు పెరుగుతుంది. తెల్ల బియ్యంలో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇందులో ఫైబర్ తక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకోవడం వల్ల బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. బియ్యం బదులుగా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవచ్చు. రాత్రిపూట రోటీ లేదా చపాతీ, రాగి, కూరగాయల సూప్ వంటి ఆహారాలు తినడానికి ప్రయత్నించాలి.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE



# అల్లు శిరీష్ పెళ్లి... పవన్ కల్యాణ్, నాగబాబు కుటుంబాలకు అందిన ఆహ్వానం

**పెళ్లికి సిద్ధమైన హీరో అల్లు శిరీష్**
**డిప్యూటీ సీఎం పవన్‌ను స్వయంగా ఆహ్వానించిన శిరీష్**
**నాగబాబు దంపతులకు కూడా పెళ్లి శుభలేఖ అందజేత**
**మార్చి 6న నయనికా రెడ్డితో శిరీష్ వివాహం**
**అన్న అల్లు అర్జున్ పెళ్లిరోజే తమ్ముడి ఏడడుగులు**

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు శిరీష్ పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. మార్చి 6న జరగనున్న తన వివాహానికి మెగా కుటుంబ సభ్యులను స్వయంగా ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో, తన తల్లిదండ్రులు అల్లు అరవింద్, నిర్మలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లి పెళ్లి శుభలేఖను అందజేశారు. పవన్ కళ్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజ్నేవాతో వీరు కాసేపు ముచ్చటించారు. మెగా బ్రదర్, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, ఆయన భార్య పద్మజను కూడా కలిసి వివాహ వేడుకలకు రావాలని కోరారు. ఈ ఆహ్వానాలకు సంబంధించిన ఫొటోలను శిరీష్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. "నేను, మా అమ్మానాన్న కలిసి పవన్ కళ్యాణ్ గారిని, శ్రీమతి లెజ్నేవా గారిని మా పెళ్లికి ఆహ్వానించాం. అలాగే నాగబాబు గారిని, శ్రీమతి పద్మజ గారిని కూడా మా వివాహ వేడుకలకు పిలిచాం. వారంతా నా పెళ్లి జరుగుతుండడం పట్ల చాలా సంతోషించారు" అని శిరీష్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అల్లు శిరీష్ తన ప్రియురాలు నయనికా రెడ్డిని మార్చి 6న వివాహం చేసుకోబోతున్నారు. హైదరాబాద్‌లో ఈ వివాహం సంప్రదాయబద్ధంగా జరగనుంది. విశేషమేమిటంటే, మార్చి 6వ తేదీ శిరీష్ అన్న, ఐకాన్ స్టార్ హీరో అల్లు అర్జున్, స్నేహా రెడ్డిల పెళ్లి రోజు. వారు 2011లో ఇదే తేదీన ఒక్కటయ్యారు. గతేడాది అక్టోబర్ 31న శిరీష్-నయనికా రెడ్డిల నిశ్చితార్థం జరగ్గా, దుబాయ్, హైదరాబాద్‌లలో గ్రాండ్‌గా ప్రీ-వెడ్డింగ్ వేడుకలు నిర్వహించారు.

# తన లగ్జరీ లైఫ్ పై వస్తున్న అసభ్యకర కామెంట్లపై హిమజ ఫైర్

**తన విలాసవంతమైన జీవితం వెనుక ఎంతో కష్టం ఉందన్న హిమజ**
**బిగ్‌బాస్ నుంచి వచ్చాక 12 మాల్స్ ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నానని వెల్లడి**
**హద్దుమీరి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక**



బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, వెండితెరపై రాణిస్తున్న నటి, బిగ్‌బాస్ ఫేమ్ హిమజ రెడ్డి తాజాగా సోషల్ మీడియా వేదికగా విమర్శకులపై నిప్పులు చెరిగారు. కష్టపడి పైకొస్తున్న ఒక తెలుగమ్మాయి సక్సెస్‌ను చూసి ఓర్వలేక, క్యారెక్టర్ మీద పడి ఏడవడం ఏంటని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. గత కొంతకాలంగా తన లగ్జరీ లైఫ్, సంపాదనపై సోషల్ మీడియాలో వస్తున్న అసభ్యకరమైన కామెంట్లకు హిమజ తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. తను అనుభవిస్తున్న ఈ విలాసవంతమైన జీవితం వెనుక ఎంతో కష్టం ఉందని హిమజ స్పష్టం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సినిమాలు, సీరియల్స్‌లో శ్రమిస్తున్నానని, బిగ్‌బాస్ నుండి బయటకు వచ్చాక దాదాపు 12 షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నానని ఆమె గుర్తు చేశారు. ఒక్కో ఓపెనింగ్‌కు వచ్చే పారితోషికమే తను వాడుతున్న కారు కొనడానికి సరిపోతుందని ఘాటుగా సమాధానమిచ్చారు. కేవలం నటన మాత్రమే కాకుండా, హెర్బాలైఫ్ సూపర్‌వైజర్‌గా, స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్‌గా రాణిస్తూ, సొంతంగా ఒక కంపెనీని కూడా నడుపుతున్నట్లు ఆమె వెల్లడించారు. ముఖ్యంగా తన ఇంటి గురించి వస్తున్న ఆరోపణలపై హిమజ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇల్లు కొనడానికి తన తల్లిదండ్రులు కూడా ఆర్థికంగా ఎంతో సాయం చేశారని, అది తెలియకుండా ఎవరో గిఫ్ట్ ఇచ్చారని కామెంట్స్ చేయడం చూస్తే వారి మనసు ముక్కలవుతుందని అన్నారు. అవసరమైతే తన ఇంటి ఈఎంఐ పేపర్లు కూడా చూపిస్తానని సవాల్ విసిరారు. ఎదుటివారి ఎదుగుదలను చూసి అసూయ పడటం మానుకోవాలని, ఒక మహిళా నటి విజయం సాధిస్తే అభినందించడం నేర్చుకోవాలని హితవు పలికారు. హద్దు మీరి ప్రవర్తిస్తే ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదని, చట్టపరమైన చర్యలకు కూడా వెనుకాడబోనని హిమజ హెచ్చరించారు.



# అల్లు శిరీష్ పెళ్లి

**పవన్ కల్యాణ్, నాగబాబు కుటుంబాలకు అందిన ఆహ్వానం**
**పెళ్లికి సిద్ధమైన హీరో అల్లు శిరీష్**
**డిప్యూటీ సీఎం పవన్‌ను స్వయంగా ఆహ్వానించిన శిరీష్**
**నాగబాబు దంపతులకు కూడా పెళ్లి శుభలేఖ అందజేత**
**మార్చి 6న నయనికా రెడ్డితో శిరీష్ వివాహం**
**అన్న అల్లు అర్జున్ పెళ్లిరోజే తమ్ముడి ఏడడుగులు**

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు శిరీష్ పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. మార్చి 6న జరగనున్న తన వివాహానికి మెగా కుటుంబ సభ్యులను స్వయంగా ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలో, తన తల్లిదండ్రులు అల్లు అరవింద్, నిర్మలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లి పెళ్లి శుభలేఖను అందజేశారు. పవన్ కళ్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజ్నేవాతో వీరు కాసేపు ముచ్చటించారు. మెగా బ్రదర్, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, ఆయన భార్య పద్మజను కూడా కలిసి వివాహ వేడుకలకు రావాలని కోరారు. ఈ ఆహ్వానాలకు సంబంధించిన ఫొటోలను శిరీష్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. "నేను, మా అమ్మానాన్న కలిసి పవన్ కళ్యాణ్ గారిని, శ్రీమతి లెజ్నేవా గారిని మా పెళ్లికి ఆహ్వానించాం. అలాగే నాగబాబు గారిని, శ్రీమతి పద్మజ గారిని కూడా మా వివాహ వేడుకలకు పిలిచాం. వారంతా నా పెళ్లి జరుగుతుండడం పట్ల చాలా సంతోషించారు" అని శిరీష్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అల్లు శిరీష్ తన ప్రియురాలు నయనికా రెడ్డిని మార్చి 6న వివాహం చేసుకోబోతున్నారు. హైదరాబాద్‌లో ఈ వివాహం సంప్రదాయబద్ధంగా జరగనుంది. విశేషమేమిటంటే, మార్చి 6వ తేదీ శిరీష్ అన్న, ఐకాన్ స్టార్ హీరో అల్లు అర్జున్, స్నేహా రెడ్డిల పెళ్లి రోజు. వారు 2011లో ఇదే తేదీన ఒక్కటయ్యారు. గతేడాది అక్టోబర్ 31న శిరీష్-నయనికా రెడ్డిల నిశ్చితార్థం జరగ్గా, దుబాయ్, హైదరాబాద్‌లలో గ్రాండ్‌గా ప్రీ-వెడ్డింగ్ వేడుకలు నిర్వహించారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM